

# లిటిల్ రాస్కెల్

## మల్లాది వెంకట కృష్ణమూర్తి

*(గత సంచిక తరువాయి)*

**సాంబశివరావు** మనస్తత్వం తనకి బాగా తెలుసు. కాలేజీలో చదివే రోజుల్లోనే కాలేజీ బ్యూటీకి రాసిన ప్రేమలేఖని ప్రిన్సిపాల్ తనకు చూపించి, కొడుకుని అదుపులో ఉంచుకోమని మందలించాడు.

రాజేష్ సంగతి కోడలికి తెలిస్తే? ఆ ఆలోచనే ఆయనకి భయాన్ని కలిగించింది. రాజేష్‌ని వెంటనే విజయవాడ పంపించెయ్యాలి. కోడలు రాకమునుపే. కానీ ముందుగా సాంబశివరావుతో మాట్లాడాలి. దశరథరామయ్య చురుకుగా ఆలోచిస్తూ చుట్ట తాగుతుంటే రెండు లేత చేతులు వెనకనుంచి ఆయన కళ్ళని నిశ్శబ్దంగా మూశాయి.

"రాజేష్" చెప్పాడు దశరథరామయ్య.

"ఉహూఁ" వినిపించిందో కంఠం.

"ఓ - బన్ని" చెప్పాడు.

"రాజేష్ ఎవరు?" అడిగింది పక్కింటి పాప దశరథరామయ్య ముందుకి వచ్చి.

"ఎవరూ లేరు స్కూలుకెళ్ళలేదా?"

"నిన్నటినించే వేసవికాలం శెలవలు ఇచ్చేశారుగా?"

"నా ప్రాణానికి" విసుక్కున్నాడు.

"ఈ సంచి, పెట్టె ఎవరివి?" అడిగింది తొమ్మిదేళ్ళ బన్ని వాటిని చూసి.

దశరథరామయ్య ఆ ప్రశ్నకి సమాధానం చెప్పలేదు. బన్ని పెట్టె తెరిచి చూసి చిన్నపిల్లల బట్టలు చూసి అడిగింది.

"ఎవరబ్బాయి?"

"నా స్నేహితులు. నీకెందుకు? ఇంటికెళ్ళి ఆడుకో, నన్ను విసిగించక."

దశరథరామయ్యకి అప్పుడు తట్టింది. బన్నీకి రాజేష్ గురించి తెలిస్తే తన కోడలికే కాక లలితానగర్ కాలనీలోని అందరికీ తెలిసినట్టే. అదీగాక శెలవలు కాబట్టి కోతిలా ప్రతీ ఇంటికి తిరుగుతుంటుంది.

వెంటనే లేచి బన్నిని చెయ్యిపట్టుకుని బయటికి తీసుకెళ్ళి చెప్పాగా. "సాయంత్రం దాకా రాకు" తలుపేసుకున్నాడు.

బన్ని నాలుగైదుసార్లు బెల్లు నొక్కింది. కానీ ఆయన తలుపు తెరవలేదు. కాసేపాగి రాజేష్ వేరే బట్టలు తొడుక్కునివచ్చాడు నల్లటి బొందులోకి టక్ చేసుకున్న లేత నీలం రంగు షర్ట్.

"నాన్నగారు త్వరగా వస్తే బాగుండును తాతయ్యా. చూడాలనుంది" చెప్పాడు.

"నాకిమ్మని మీ అమ్మ నీకు ఉత్తరం ఏదీ ఇవ్వలేదా?" అడిగాడు.

"లేదు."

రాజేష్‌లో సాంబశివరావు పోలికలకోసం చూశాడు. కనపడలేదు.

"తాతయ్యా! ఆకలేస్తోంది" చెప్పాడు.

"పద" లేచి రాజేష్‌ని వంటగదిలోకి తీసుకెళ్ళాడు. రాజేష్‌కి వడ్డిస్తోంటే బయట దణ్ణెం మీద శుభ్రంగా ఉతికి, ఆరేసివున్న ఆ కుర్రాడు విడిచిన బట్టలని, టవలుని చూశాడు దశరథరామయ్య. 'గుడ్ మేనర్స్' మనసులో అనుకున్నాడు.

"మా నాన్నగారికి ఇష్టమనేనా, ఉల్లిపాయ ముక్కలు కలిపిన కందిపచ్చడి, కాకరకాయ వేపుడు చేశారు?" అడిగాడు రాజేష్ వాటిని చూసి.

దశరథరామయ్య మనసులోనే ఉలిక్కిపడ్డాడు ఆ మాటలకి.

"నీకెవరు చెప్పారు?" అడిగాడు వెంటనే.

"మా అమ్మ ఇవి చేసినప్పుడల్లా చెప్తూంటుంది."

"అన్నం తిన్నాక నేనోసారి బయటికి వెళ్ళొస్తాను. అరగంటలో వచ్చేస్తాను."

"అలాగే తాతయ్యా"

రాజేష్ భోజనం చేసే పద్ధతి చూస్తుంటే చాలా ఆకలిమీద వున్నాడనిపించింది. ఎంతో ముచ్చటగా తింటున్నాడు నీట్‌గా.

మొదటి ముద్దలు తినబోయేముందు చెప్పాడు ఒకో ముద్దకి "ఇది తాతయ్య ముద్ద, ఇది నాన్నగారి ముద్ద, ఇది అమ్మ ముద్ద, ఇది శ్రీరాముడి ముద్ద, ఇకనించి యివి నా ముద్దలు."

"శ్రీరాముడెవరు?" అడిగాడు దశరథరామయ్య.

"సీతమ్మవారి భర్త. రామాయణం తెలియదా నీకు?"

భోజనం అయి రాజేష్ పడుకున్నాక, దశరథరామయ్య చెప్పులు తొడుక్కుని ఇంటి బయట తలుపు తాళం పెట్టుకుని బయలుదేరాడు. రామ్‌నగర్ లో తనకి తెలిసిన లాయర్ ఇంటికెళ్ళి ఫోన్ చేసుకోవాలని చెప్పాడు.

సాంబశివరావు పనిచేసే బేంక్ ఫోన్ నెంబర్ తిప్పి, అతను కావాలని అడిగాడు. సీట్‌లో లేడు. వచ్చి అప్పుడే బయటకి వెళ్ళాడట.

వస్తే అతని తండ్రి ఫోన్ చేశాడని, ఫలానా నెంబర్‌కి ఫోన్ చేయమని కోరాడు. పది నిమిషాల తర్వాత సాంబశివరావునించి ఫోన్ వచ్చింది.

"ఏమిటి నాన్నగారూ?" అతని కంఠంలో ఆశ్చర్యం తొంగి చూసింది. ఆఫీసుకి తండ్రి ఫోన్ చేయటం అదే మొదటిసారి.

"రాజేష్ వచ్చాడు" పొడిగా చెప్పాడు దశరథరామయ్య.

"ఎవరు?"

"రాజేష్ విజయవాడనించి పొద్దున్న నువ్వు బేంక్‌కి వెళ్ళాకొచ్చాడు."

"రాజేష్ ఎవరు?"

"ఆ పేరుగలవాళ్ళెవరూ నీకు తెలీదా?"

"లేదే? నేను తెలుసునని చెప్పాడా?"

"రాజేష్ వయసు ఏడు."

"ఏడేళ్ళ రాజేషా?" ఈసారి సాంబశివరావు కంఠంలోని ఆశ్చర్యం అధికం అయింది.

"రాజేష్‌ని నీ దగ్గరకి వాళ్ళ అమ్మ పంపించింది."

"రాజేష్ వాళ్ళమ్మ పంపించిందా? ఆవిడెవరు?"

"అది నువ్వే చెప్పాలి."

"అంటే?"

"రాజేష్ తన తండ్రిపేరు సాంబశివరావని, తాతయ్య పేరు దశరథరామయ్య అని చెప్తున్నాడు."

కొన్ని క్షణాలు అవతలివైపు నిశ్శబ్దం సాంబశివరావని, తాతయ్య పేరు దశరథరామయ్య అని చెప్తున్నాడు."

కొన్ని క్షణాలు అవతలివైపు నిశ్శబ్దం. సాంబశివరావుకి తన మాటల్ ఎలక్ట్రిసిటీలాగా షాక్ కొట్టాయని గ్రహించాడు దశరథరామయ్య. "రాజేష్ నా కొడుకా?" పెగుల్చుకుని అడిగాడు సాంబశివరావు.

"కాడా?"

"ఛ! నాకు కొడుకులేంటి? ఎవడో మోసగాడై వుంటాడు. పంపించెయ్ ఆ వెధవని."

"సాయంత్రం కోడలికన్నా ముందుగా ఇంటికి రారాదూ?"

"అలాగే"

కొన్ని క్షణాలు తటపటాయించి చెప్పాడు సాంబశివరావు "రాజేష్ ఏమిటి? నా కొడుకవటమేమీటి? ఇదేదో వింతగా వుంది."

దశరథరామయ్య టెలిఫోన్ ఛార్జీ చెల్లించి ఇంటికి బయలుదేరాడు. కొడుకు మాటల్లో నిజాయితీ కనిపించింది. రాజేష్ వాడి కొడుకు, నా మనమడు కాడు అనుకున్నాడు స్థిరంగా.

కాంపౌండ్ వాల్ దటి లోపలికి అడుగు పెట్టగానే కిటికీమీద ఎక్కి కిటికీ చువ్వలు పట్టుకుని లోపలికి చూస్తూ మాట్లాడుతున్న బన్నీ ఆయన కంటపడింది.

"ఏం చేస్తున్నావ్ యిక్కడ?" గద్దించాడు.

"మీ మనవడితో మాట్లాడుతున్నాను" చెప్పింది బన్ని.

"నా మనుమడని నీకెవరు చెప్పారు?"

"మరి రాజేష్‌కి మీరు తాతయ్య అయితే రాజేష్ మీకు మనవడు కాడా మరి? మీ కొడుకుకి రాజేష్ కొడుకయితే, మీకు మనవడు కాడా మరి?"

"భడవఖానా! నీకెందుకు పో అవతలకి" కసిరాడు.

దశరథరామయ్య తలుపు తీసుకుని లోపలికి వెళ్ళగానే, పిల్లిలా ఆయన వెనకాలే లోపలికి వచ్చింది బన్ని.

"పనయిపోయిందా తాతయ్యా?" అడిగాడు రాజేష్.

"నిద్రపోకుండా ఎందుకు మేలుకుని వున్నావ్?" అడిగాడు కోపంగా.

"నిద్రపోతుంటే బన్ని బెల్లునొక్కి లేపింది. నిద్రపోవద్దని, మాట్లాడమని గొడవచేస్తుంటే"

"మీ రాజేష్ చాలా మంచివాడు. పొద్దున్నే నేను వాడిమీద బకెట్ నీళ్ళు పోసినా ఏం అనలేదు" చెప్పింది బన్ని.

రాజేష్ తడిబట్టలతో వటం గుర్తుకొచ్చింది దశరథరామయ్యకి.

"ఎండవేళ ఇంటికెళ్ళి పడుకో తిరక్కు" చెప్పాడు బన్నీతో.

"ఎండవేళ ఇంటికెళ్ళి పడుకో తిరక్కు" దశరథరామయ్యని వెక్కిరించింది బన్ని.

"నిన్నటితో బన్ని పరీక్షలయిపొయ్యాయట తాతయ్యా" చెప్పాడు రాజేష్.

"మీ రాజేష్ మంచివాడులా వున్నాడు .ఇంక ఎప్పటికీ యిక్కడే వుంటాడా?" అడిగింది బన్ని.

"తాతయ్యా బన్ని నిన్న రాత్రి ఢిల్లీని తమిళనాడు రాజధానిగా చేయమని వెంకటేశ్వరస్వామిని ప్రార్థించిందట తెలుసా?" చెప్పాడు రాజేష్ పెదవులు విడవకుండా నవ్వుతూ.

దశరథరామయ్యకి బన్ని అక్కడ వుండటం ఇబ్బందిగా వుంది.

"దేనికో తెలుసా తాతయ్యా? పరీక్షల్లో ఓ ప్రశ్నకి సమాధానం ఆ విధంగా రాసిందట" చెప్పాడు రాజేష్ నవ్వుతూ.

"మీ మనవడికి ఉడత స్నేహితుడున్నాడు" చెప్పింది బన్ని దశరథరామయ్యతో.

"బన్నీ! ప్లీజ్ వెళ్ళు. ప్లీజ్ అన్నానా వెళ్ళు" బ్రతిమలాడారు దశరథరామయ్య.

ఏమనుకుందో బన్ని తలాడించి "సాయంత్రం ఆడుకోడానికి వస్తా అని రాజేష్‌తో చెప్పి వెళ్ళిపోయింది. వెళ్తూ బెల్ నొక్కి మరీ వెళ్ళింది.

"అమ్మకాక మీ ఇంట్లో ఇంకెవరుంటారు?" అడిగాడు దశరథరామయ్య రాజేష్‌ని.

"ఇంకెవ్వరూ వుండరు. మేం ఇద్దరమే" జవాబు చెప్పాడు.

"నీకు తమ్ముళ్ళూ, అన్నలు, చెల్లెళ్ళు ఎవరూ లేరా?"

"లేరు."

"ఛీ!ఛీ లాగూలోనే? బాత్‌రూంకి వెళ్ళమని చెప్పానా?" చిరాకుగా చెప్పాడు దశరథరామయ్య తడిసిన రాజేష్ లాగూని చూసి.

"నేనుకాదు తాతయ్యా" అనబోయి ఆగిపోయాడు. పెట్టెలోంచి వేరే లాగూ తీసుకుని సిగ్గుతో తలవంచుకుని బాత్రూంలోకెళ్ళాడు. విడిచిన లాగు తడిపి ఆరేసి, వేరే నిక్కరు వేసుకుని వచ్చాక అడిగాడు రాజేష్.

"తాతయ్యా నీకు బొమ్మలు వెయ్యటం వచ్చా? నా బొమ్మలు చూస్తావా?"

దశరథరామయ్య చిరాకుని అణుచుకుని తల అడ్డంగా తిప్పాడు. "తర్వాత" చెప్పాడు.

"అయితే తర్వాత చూపిస్తాలే. నిద్రవస్తోంది వెళ్ళి పడుకోనా?"

"పడుకో"

"నాన్నగారు రాబోయేముందు లేపు తాతయ్యా మొహం కడుక్కుని నీట్‌గా తయారవుతాను. ఏం?"

అన్యమనస్కంగా తలవూపాడు దశరథరామయ్య.

"తాతయ్యా నీ తెల్లగడ్డం, మీసం చూడటానికి బావుంటాయి. అవి నాకెంతో యిష్టం" చెప్పాడు. సన్నగా నవ్వాడు దశరథరామయ్య.

సాయంత్రం అయిదున్నరకల్లా వచ్చేశాడు సాంబశివరావు. అతని కోసం దశరథరామయ్యకన్నా రాజేష్ అధిక ఆసక్తితో ఎదురుచూస్తున్నాడు.

"వీడేనా?" అడిగాడు సాంబశివరావు రాజేష్ వంక తీక్షణంగా చూస్తూ.

"అవును."

రాజేష్ ఊహించింది, ఎదురుచూసింది వేరు. తాతయ్య తనని తన తండ్రికి పరిచయం చేస్తాడనుకున్నాడు. తండ్రి ఎత్తుకుని, ముద్దుపెట్టుకుని, అమ్మెలా వుందని అడిగి... అలా జరగకపోగా, సాంబశివరావు తనవంక చూసిన చూపులో కోపం పసికట్టాడు.

"మీ అమ్మ పేరు?" అడిగాడు సాంబశివరావు.

"అమ్మ."

"అమ్మకి ఏదో పేరుంటుందిగా - అంతా ఏమని పిలుస్తారు?"

"మేడమ్ అని."

"మీ నాన్న పేరు?"

బిత్తరపోయి చూశాడు రాజేష్. కొన్ని క్షణాల తరువాత నెమ్మదిగా చెప్పాడు.

"సాంబశివరావుగారు."

"ఇట్స్ నాట్ ట్రూ. హి ఈజ్ నాట్ మై సన్. రాజేష్‌కి తెలియదని ఇంగ్లీషులో తండ్రితో చెప్పాడు సాంబశివరావు.

"వాట్ షల్ వి డు?" అడిగాడు దశరథరామయ్య.

"వి మస్ట్ ఆస్క్ హిమ్ టు లీవ్."

"నీ దగ్గర డబ్బెంతుంది?" అడిగాడు సాంబశివరావు రాజేష్‌ని.

"ఇంతే"

జేబులోంచి చిల్లర తీసి చూపించాడు భయంభయంగా. రాజేష్‌కి ఎక్కడలేని భయం ఆక్రమించుకుంది ఆ కాసేపట్లో.

"ఐ అండర్ స్టాండ్ ది గేమ్. ఐ విల్ హేవ్ టు పేహిమ్ సమ్ థింగ్ టు సెండ్ హిమ్ ఎవే. దిస్ లుక్స్ లైక్ ది ఇన్‌వెన్షన్ ఆఫ్ ఏన్ ఇంటిలిజెంట్ క్రూక్. షి మస్ట్ బి.ఏ బ్రెయిన్ క్రూక్" చెప్పాడు సాంబశివరావు.

"నో - షి ఈజిన్టు ఏ క్రూక్"

పెద్దవాళ్ళిద్దరూ ఆ మాటలన్న అతనివంక తెల్లబోతూ చూశారు.

"మై మదర్ ఈజ్ ఏ నైస్ లేడీ. ఇఫ్ యు వాంట్, ఐ షల్ లీవ్. ఐ డోంట్ వాంట్ ఎనీ మనీ ఫ్రం యు అండ్ ఆర్ నాట్ క్రూక్స్."

రాజేష్ ఎర్రబడ్డ మొహంతో, అవమానంతో గిరుక్కున వెనక్కి తిరిగి బాత్‌రూంలోకి పరిగెత్తాడు.

"ఇంగ్లీషు వచ్చిన దొంగల ముఠాకి చెందినవాడు నాన్నగారూ" చెప్పాడు సాంబశివరావు.

ఈసారి దశరథరామయ్య కళ్ళల్లో సందేహం తొంగిచూసింది. సాంబశివరావుని నిశితంగా చూసి అడిగాడు.

"మీ ఆవిడకి ఈ విషయం తెలిస్తే ఏమవుతుంది?"

"నేనెందుకు భయపడాలి? అసలు వాడు నా కొడుకయితేగా?"

రాజేష్ అయిదారు నిమిషాల తర్వాత ముఖం కడుక్కుని బ్రాత్రూంలోంచి బయటికి వచ్చాడు. వాడు ఏడ్చినట్లు ముఖం ఉబ్బి వుంది. దశరథరామయ్యకి వాడిమీద జాలికలిగింది.

బయట ఆటో ఆగిన చప్పుడైంది. తండ్రీ కొడుకులిద్దరూ మొహమొహాలు చూసుకుంటూండగా చేతిలో పుచ్చకాయ, ఖర్బూజ కాయలతో లోపలికి వచ్చింది నీరజ.

"మీరు యూనివర్శిటీకి రాలేదే? చూసి చూసి విసుగేసి ఆటోలో వచ్చేశాను"

రాజేష్‌ని నీరజ గమనించి అడిగింది భర్తని.

"ఈ అబ్బాయ్ ఎవరండీ? ఎక్కడో చూసినట్టు గుర్తు."

దశరథరామయ్య తన బరువుని కుడికాలి మీంచి ఎడమకాలి మీదకు మార్చడం తప్ప సమాధానం చెప్పలేదు. సాంబశివరావు జవాబు చెప్పే ప్రయత్నం చేయలేదు.

"మిమ్మల్నే ఎవరండీ ఈ కుర్రాడు?" భర్తని అడిగింది నీరజ మళ్ళీ.

"నే చెప్తాను" వాళ్ళ వెనకనుంచి ఓ ఆడకంఠం వినిపించింది.

అంతా వెనక్కి తిరిగి చూశారు.

బన్నీ.

"నే చెప్తాను ఆంటీ. వాడి పేరు రాజేష్. దశరథరామయ్య మనవడు, మీ ఆయన కొడుకు."

నోరు తెరుచుకుని బన్నీవంక చూస్తూండిపోయింది నీరజ. ఆ పాప చెప్పిన విషయం సూటిగా మనసుకి వెంటనే ఎక్కటంతో.

"నిజమా?" అడిగింది ఇంకా అలాగే చూస్తూ.

"అవును ఆంటీ రాజేషే నాకు చెప్పాడు. కావాలంటే మీరే అడగండి."

"నిజమా?" అడిగింది నీరజ. రాజేష్‌ని కాదు (తన భర్తని) సాంబశివరావు తల అడ్డంగా వూపడం తప్ప వెంటనే నోటితో సమాధానం చెప్పలేకపోయాడు.

నీరజ తన భర్తమీంచి చూపుని దశరథరామయ్య మీదకి మార్చింది. ఆయన గొంతు సర్దుకుని చెప్పాడూ.

"చూడమ్మాయ్ రాజేష్ తన తండ్రి సాంబశివరావంటున్నాడు. సాంబశివరావు నేను కాదంటున్నాడు. నిజానిజాలు తెలుసుకునేదాకా మనం మథనపడటం అనవసరం."

సాంబశివరావు వంక చూసింది నీరజ. అంతదాకా జీవితంలో ఎన్నడూ చూడని ఎవరో కొత్త వ్యక్తివంక చూసినట్లుగా వుందా చూపు.

చేతిలోని పుచ్చకాయని, ఖర్బూజని వంగి నేలమీద వుంచింది. నెమ్మదిగా రాజేష్ దగ్గరకి నడిచి వెళ్ళింది. తన చేతిని భుజంపై చాపింది. కొన్ని క్షణాలు తతపటాయించింది ముట్టుకోడానికి. తరువాత భుజంమీద చెయ్యివేసి అడిగింది.

"మీ అమ్మ పేరేమిటి బాబూ?"

"అమ్మ" భయం భయంగా చూస్తూ చెప్పాడు రాజేష్

"నాన్న పేరు?"

"సాంబశివరావుగారు."

"ఏ సాంబశివరావుగారు?"

కె. సాంబశివరావుగారు"

"మీ నాన్నగారెవరో నీకెలా తెలుసు?"

"అమ్మ చెప్పింది."

దశరథరామయ్య బన్నీని అప్పటికే బయటికి తీసుకెళ్ళిపోయాడు. ఇదంతా ఆ పా ప దృష్టిలో పడకూడదని.

భర్తవైపు తిరిగి ప్రశాంతంగా అడిగింది నీరజ.

"ఇందులో నిజం నిజంగా వుండి వుంటే వప్పుకోండి."

"లేదు నీరజా అబద్ధం ఆడాల్సిన పనిలేదు. ఇలాంటిదేదైనా వుండి వుంటే పెళ్ళికి ముందే చెప్పివుండేవాడిని" సిన్సియర్‌గా చెప్పాడు సాంబశివరావు.

నీరజ భర్త మాటలు వెంటనే నమ్మింది. రాజేష్ అమాయకమయిన మొహం చూస్తుంటే వాడినీ నమ్మాలనిపిస్తోంది.

"ఇలారండి"

భర్తని తమ గదిలోకి తీసుకెళ్ళింది.

"రాజేష్ నిజంగా మీ కొడుకయితే అలా కాదని వాడిముందు అబద్దం ఆడకండి. ఇంత చిన్న వయసులో ఏర్పడే ఇలాంటి పెద్ద విషయాలు తాలూకు ఇంప్రెషన్స్ జీవితాంతం చెరిగిపోవు."

"ప్రామిస్! వాడు నా కొడుకు కానేకాడు."

"ఆమెకు గర్భం వచ్చిన సంగతి మీకు తెలియకపోవచ్చుగా?"

"ఎవరికి నువ్వనేది?"

"రాజేష్ తల్లికి"

"ఆవిడెవరు?"

"ఐమీన్.. మీరు వివాహం చేసుకుంటానన్న మీ విజయవాడ ప్రియురాలికి."

"డోంట్ బి సిల్లీ. ఆమెకు గర్భం రాలేదు."

"వచ్చినా మీకు చెప్పి వుండకపోవచ్చుగా?"

"రాకుండా ముందే జాగ్రత్తపడింది" సాంబశివరావు చటుక్కున నాలిక కరుచుకున్నాడు మాట తూలినందుకు.

నీరజ భర్తని తేరిపార చూస్తూ అడిగింది.

"అంటే మన పెళ్ళయ్యాక నేనడిగిన మొదటి ప్రశ్నకి నిజం చెప్తానని నన్ను నమ్మించి అబద్దం చెప్పారన్నమాట?"

"మీ ఇద్దరికీ శారీరక సంబంధం లేదన్నారా?"

"అంటే?"

"లేదు"

"లేకపోతే గర్భం రాకుండా ఆమె జాగ్రత్తపడాల్సిన అవసరం వుంటుందా?"

సాంబశివరావు వెంటనే ఆ ప్రశ్నకి సమాధానం చెప్పలేకపోయాడు.

"చెప్పండి. ఇంత చిన్న విషయంలో అబద్ధం ఆడినవారు కొడుకు పుట్టడం లాంటి పెద్ద విషయంలో అబద్దం తేలికగా ఆడారని నేననుకోవచ్చుగా?"

"జాగ్రత్తపడటమంటే నా ఉద్దేశం అసలు శారీరక సంబంధం లేకుండా ఉండటం."

"మీ ఉద్దేశమా? ఆమె ఉద్దేశమా?"

"ఇద్దరి వుద్దేశం" తన మాటల్లో తనకే నమ్మకం లేదని గ్రహించాడు సాంబశివరావు ఆ మాట చెప్పాక.

"నామకరణం మీరే చేశారా? నేను మీ రెండో పెళ్ళాన్నా?" నీరజ కళ్ళల్లో నీళ్ళు తిరుగుతుంటే అడిగింది.

"డోంట్ బి సిల్లీ నీరజా! నాకెవరితో పెళ్ళికాలేదు. నన్ను నమ్ము. వాడెవడో నాకు తెలియదు. వాడి తండ్రి నేను కాదంటే కానేకాదు."

"కాకపోతే ఇక్కడ ఎందుకున్నాడు? విజయవాడనించి మనింటికే రావాల్సిన అవసరం ఎందుకొచ్చింది? పక్కింటికెళ్ళచ్చుగా? మాసాబ్ టాంక్ దగ్గర ఎవరింటికైనా వెళ్ళచ్చుగా? మెహదీ పట్నంలో ఎవరింటికైనా వెళ్ళచ్చుగా? సీతాఫల్ మండీలో ఎవరింటికైనా వెళ్ళచ్చుగా? అసలు హైదరాబాద్‌కే, అందులో మీ ఇంటికే రాజేష్‌ని ఆమె పంపాల్సిన అవసరం ఏమిటి? చెప్పండి. ఐ నీడ్ ది ట్రూత్. ఐ వాంట్ నథింగ్ బట్ ట్రూత్ అండ్ ది ట్రూత్ ఓన్లీ" నీరజ చేతులతో మొహాన్ని కప్పుకుని వెక్కి వెక్కి ఏడుస్తోంది."

*(కొనసాగింపు వచ్చేనెలలో)*

Post your comments

ప్రస్తుతం అందుబాటులో ఉన్న మల్లాదిగారి పుస్తకాల వివరాల కోసం ఇక్కడ క్లిక్ చేయండి

www.anandbooks.com
www.telugubooks.in